సత్తాచాటిన తెలంగాణ

జాతీయ సెపక్‌తక్రా టోర్నీ • మహిళల టీమ్ ఈవెంట్‌లో ఎస్ఎస్‌బీ, పురుషుల్లో మణిపూర్ విజేత

హనుమకొండ చౌరస్తా, జనవరి 10: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో 34వ జాతీయ సీనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో తెలంగాణ మహిళల జట్టు బోణీ కొట్టింది. శనివారం జరిగిన మహిళల డబుల్ ఈవెంట్‌లో తెలంగాణ 2-0తో ఢిల్లీపై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచిన రాష్ట్ర జట్టు సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రత్యర్థి ఢిల్లీకి ఎక్కడా అవకాశమివ్వని మనోళ్లు కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. మిగతా మ్యాచ్‌ల్లో ఆలిండియా పోలీస్ 2-1తో కేరళపై, తెలంగాణపై ఆలిండియా 2-0తో గెలిచాయి. పోటీల రెండో రోజు మహిళల, పురుషుల టీమ్ ఈవెంట్ సెమీఫైనల్స్, ఫైనల్స్ జరిగాయి. ఇందులో మహిళల టీమ్ ఈవెంట్ తుదిపోరులో ఎస్ఎస్‌బీ 2-0తో నాగాలాండ్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. అంతకుముందు సెమీస్‌లో ఎస్ఎస్‌బీ 2-1తో మణిపూర్‌పై, నాగాలాండ్ 2-1తో యూపీపై గెలిచాయి. పురుషుల టీమ్ టైటిల్ పోరులో మణిపూర్ 2-0తో ఢిల్లీపై గెలిచింది. తొలుత సెమీఫైనల్స్‌లో మణిపూర్ 2-1తో ఎస్ఎస్‌బీపై, ఢిల్లీ 2-1తో అసోంపై విజయాలు సాధించాయి. ఈ సందర్భంగా పోటీలను రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ హనుమాండ్లరెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, కోశాధికారి వికేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జగన్నాథస్వామి, శ్రీధర్, సంజీవరెడ్డి, అనిత, అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్స్ విజయరాజ్, సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలు జితేందర్‌నాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధన్‌రాజ్ పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో విజేత వరంగల్

గీసుగొండ, జనవరి 11 : వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు శనివారం ముగిశాయి. మూడు రోజుల పాటు సాగిన క్రీడల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన పురుషుల, మహిళల జట్లతో పాటు ఒక పోలీస్ కానిస్టేబుల్ టీమ్ తలపడ్డాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో వరంగల్ జట్టు 33-29 తేడాతో రంగారెడ్డిపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. హైదరాబాద్‌కు మూడో స్థానం దక్కింది. మహిళల కేటగిరీలో రంగారెడ్డి టీమ్ 23-18 తేడాతో పాలమూరుపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది.

సిరీస్ లక్ష్యంగా

నేడు భారత్, ఐర్లాండ్ రెండో వన్డే

రాజ్‌కోట్: ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌పై భారత మహిళల జట్టు కన్నేసింది. ఆదివారం ఇరు జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలుండంగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. సీనియర్ల గైర్హాజరీలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రతీకా రావల్, తేజల్ హసబ్నిస్ అదరగొడుతున్నారు. అరంగేట్రంలోనే సత్తాచాటుతూ భవిష్యత్‌పై ఆశలు రేపుతున్నారు. రెండో వన్డే లోనూ ఇదే సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ ఐర్లాండ్‌ను ఓడించేందుకు టీమ్‌ఇండియా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నది. మరోవైపు కనీసం పోటీనిచ్చేందుకు ఐర్లాండ్ తహతహలాడుతున్నది.

కివీస్‌పై శ్రీలంక గెలుపు

అక్లాండ్: న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో శ్రీలంక 140 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. లంక నిర్దేశించిన 291 పరుగుల లక్ష్య ఛేదనలో కివీస్..29.4 ఓవర్లలో 150 పరుగులకు కుప్పకూలింది. అసిత ఫెర్నాండో (3/26), మహేశ్ తీక్షణ(3/35), ఇషాన్ మలింగ(3/35) ధాటికి కివీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. మార్క్ చాప్‌మన్(81) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేయగా, విల్‌యంగ్, టామ్‌లాథమ్, ఫిలిప్స్ డకౌట్లుగా వెనుదిరిగారు. తొలుత నిస్సంక(66), కుశాల్ మెండిస్(54), జతిన్ లియాంగె(53) అర్ధసెంచరీలతో లంక 50 ఓవర్లలో 290/8 స్కోరు చేసింది. మ్యాట్ హెన్రీ(4/55) నాలుగు వికెట్లతో రాణించాడు. ఫెర్నాండోకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', హెన్రీకి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

షమీ ఆగయా

14 నెలల తర్వాత జట్టులోకి • ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు టీమ్ ఎంపిక

ముంబై: ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శనివారం భారత క్రికెట్ జట్టును బీసీసీఐ ఎంపిక చేసింది. ఈనెల 22 నుంచి మొదలవుతున్న సిరీస్ కోసం సీనియర్ సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. గాయం కారణంగా నిరుడు వన్డే ప్రపంచకప్ తర్వాత నుంచి జట్టుకు దూరమైన సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ తిరిగి జట్టులోకి వచ్చాడు. పాకిస్థాన్ వేదికగా వచ్చే నెలలో జరుగనున్న ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో పెట్టుకుని షమీ ఫిట్‌నెస్‌ను అంచనా వేసేందుకు సెలెక్టర్లు ఈ అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో 14 నెలల తర్వాత షమీ టీమ్‌ఇండియాకు ఆడబోతున్నాడు. వాస్తవానికి గాయం నుంచి తేరుకున్న ఈ స్వింగ్ బౌలర్ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బెంగాల్ తరపున బరిలోకి దిగాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆడాలన్న పట్టుదలతో ముస్తాక్ అలీ టోర్నీలో సత్తా చాటాడు. అయితే ఆఖర్లో కాలిమడమకు తిరిగి వాపు రావడంతో జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందాడు. ఈ కారణంగా బీజీటీ సిరీస్‌లో షమీ సేవలు భారత్‌కు అందుబాటులో లేకపోవడం బౌలింగ్ భారమంతా బుమ్రాపై పడింది. ఐదు టెస్టుల్లో విరామం లేని బౌలింగ్ చేసిన బుమ్రా ప్రస్తుతం గాయంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీకి షమీని సిద్ధం చేస్తున్నారు.

సూర్య సారథ్యంలో: కోల్‌కతా వేదికగా ఈనెల 22 నుంచి మొదలయ్యే టీ20 సిరీస్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్‌గా సూర్యకుమార్‌యాదవ్ వ్యవహరించనున్నాడు. శాంసన్, అభిషేక్, హార్దిక్, రింకూసింగ్ జట్టులో నిలుపుకోగా, మెల్‌బోర్న్ హీరో నితీశ్‌కుమార్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అక్షర్‌పటేల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చారు. షమీకి తోడు అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్‌రానా పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, సుందర్, అక్షర్ స్పిన్ దళాన్ని నడిపించనున్నారు. జితేశ్ శర్మ స్థానంలో వికెట్‌కీపర్, బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్‌కు అవకాశమిచ్చారు. అంతకుమించిన భారీ మార్పులేమి లేవు.

జట్టు వివరాలు: సూర్యకుమార్(కెప్టెన్), అక్షర్‌పటేల్(వైస్ కెప్టెన్), శాంసన్, అభిషేక్, తిలక్‌వర్మ, హార్దిక్, రింకూసింగ్, నితీశ్‌కుమార్, హర్షిత్, అర్ష్‌దీప్‌సింగ్, షమీ, చక్రవర్తి, బిష్ణోయ్, సుందర్, జురెల్.

తొలి టీ20: కోల్‌కతా: జనవరి 22
రెండో టీ20: చెన్నై: జనవరి 25
మూడో టీ20: రాజ్‌కోట్: జనవరి:28
నాల్గో టీ20: పుణె: జనవరి 31
ఐదో టీ20: ముంబై: ఫిబ్రవరి 2

చాంపియన్ 12 కార్ప్స్ ట్రూప్స్

ముగిసిన సదరన్ కమాండ్ వాలీబాల్ పోటీలు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఆర్మీ సదరన్ కమాండ్ ఇంటర్ వాలీవాల్ చాంపియన్‌షిప్‌లో12 కార్ప్స్ ట్రూప్స్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం సికింద్రాబాద్ జరిగిన ఫైనల్లో 12 కార్ప్స్ ట్రూప్స్ 25-19, 25-18, 25-20 తేడాతో 12 ర్యాపిడ్ జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఎంఈ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్ విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలతో పాటు పతకాలను అందజేశారు.

కోదాడలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ

కోదాడ, జనవరి 11: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఖ్యాతి పాలడుగు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. బాలబాలికలు, జూనియర్, సీనియర్ ప్లేయర్లు టోర్నీలో పాల్గొంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ, వరంగల్, హన్మకొండ తదితర జిల్లాల నుంచి వంద మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పాండురంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి కలిసి ప్రారంభించారు.

కార్తీక్ జోడీ ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీలో భారత యువ జోడీ సాయి కార్తీక్‌రెడ్డి, విష్ణువర్ధన్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో కార్తీక్, విష్ణువర్ధన్ ద్వయం 7-6(7-4), 3-6, 7-10 తేడాతో కొరియా జంట యాంగ్‌సియోక్ జియాంగ్, సంగ్ పార్క్ చేతిలో ఓటమిపాలైంది. తొలి సెట్‌ను గెలుచుకున్న కార్తీక్ జోడీ ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. ప్రత్యర్థి పుంజుకుని పోటీలోకి రావడంతో మ్యాచ్‌ను చేజార్చుకుంది.

సాత్విక్ జోడీ నిష్క్రమణ

మలేషియా ఓపెన్

కౌలాలంపూర్: మలేషియా బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్, చిరాగ్ ద్వయం 10-21, 15-21తో కొరియా జోడీ కిమ్‌వోన్ హో, సియో సంగ్ చేతిలో ఓటమిపాలైంది. 40 నిమిషాల వ్యవధిలోనే ముగిసిన మ్యాచ్‌లో ఏడో సీడ్ సాత్విక్ జంట స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. వరుసగా మూడోసారి సెమీస్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన ఈ యువ జోడీ వరుస గేముల్లో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఓడిపోవడం ఒకింత నిరాశ కల్గించిందని, కానీ దీని నుంచి నేర్చుకుని ముందంజ వేస్తామని మ్యాచ్ తర్వాత సాత్విక్ పేర్కొన్నాడు.

ఫుడ్ పాయిజన్ ఘటనలో ఎస్సీ డీడీ సరెండర్

హెచ్‌డబ్ల్యూవో, ఏఎస్‌డబ్ల్యూవో సస్పెన్షన్

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 11 : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఈ నెల 8న జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో ముగ్గురు అధికారులపై వేటు పడింది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆ శాఖకు సరెండర్ చేయడంతో పాటు, సంబంధిత హెచ్‌డబ్ల్యూవో, ఏఎస్‌డబ్ల్యూవోను కలెక్టర్ పమేలా సత్పతి సస్పెండ్ చేశారు. వసతిగృహంలో ఐదుగురు పిల్లలు అస్వస్థతకు గురికాగా, వార్డెన్ ఆర్ఎంపీతో చికిత్స చేయించడం, హాస్టల్‌కు వైద్యుడిని అనుమతించడం, 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించాల్సి ఉండగా, ఆటోలో తీసుకెళ్లడంతో సంక్షేమాధికారి రేవా, ఏఎస్‌డబ్ల్యూవో విజయపాల్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు. ఘటనను జిల్లా ఉన్నతాధికారులకు వెంటనే తెలుపని ఎస్సీ డీడీ నాగలైశ్వర్‌ను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు సరెండర్ చేసినట్టు తెలిపారు.

'గేమ్ చేంజర్'పై సర్కారు యూటర్న్

- **అదనపు షోలు, టికెట్ రేట్ల పెంపు ఉపసంహరణ**
- **ఈ నెల 16 తర్వాత అమల్లోకి**

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): 'గేమ్ చేంజర్' సినిమాపై ప్రభుత్వం యూటర్న్ తీసుకున్నది. అదనపు షోలు, టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ ఈ నెల 8న జారీచేసిన జీవోను ఉపసంహరించుకున్నది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 'గేమ్ చేంజర్'కు ఇచ్చిన ప్రత్యేక అనుమతులపై 24 గంటల్లోగా సమీక్షించాలని శుక్రవారం హైకోర్టు ఆదేశించడంతో ప్రభుత్వం దిగివచ్చింది. కానీ, ఇక్కడ మరో మెలిక పెట్టింది. ప్రత్యేక అనుమతుల ఉపసంహరణ ఉత్తర్వులు ఈ నెల 16 తర్వాత అమల్లోకి వస్తాయని పేర్కొన్నది. అంటే.. అప్పటివరకు అదనపు షోలు, పెంచిన టికెట్ ధరలు కొనసాగుతాయన్నమాట. రాష్ట్రంలో బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ రేట్ల పెంపు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఓసారి ప్రకటించి యూటర్న్ తీసుకున్న సంగతి తెలిసిందే. తాజా ఉత్తర్వులతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒకే అంశంలో రెండోసారి యూటర్న్ తీసుకున్నట్టయింది.

సిద్దిపేట జిల్లా చేర్యాలలో మున్సిఫ్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డి. చిత్రంలో జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి సాయి రమాదేవి, ఇన్‌చార్జి కలెక్టర్ అబ్దుల్ హమీద్

కేసుల పరిష్కారంలో ఏఐ కీలకపాత్ర

- **హైకోర్టు జడ్జి విజయసేన్‌రెడ్డి**
- **చేర్యాల ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టు ప్రారంభం**

చేర్యాల, జనవరి 11 : భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషించనుందని హైకోర్టు జడ్జి విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ఫస్ట్‌క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు చేర్యాల జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా జడ్జి సాయి రమాదేవి, ఇన్‌చార్జి కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు మేధావుల సంఘీభావ సభలో అభివాదం చేస్తున్న అతిథులు

అందరికీ సమన్యాయం దక్కాలి

- **ప్రొఫెసర్ హరగోపాల్**
- **ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఎస్సీ వర్గీకరణకు మేధావుల సంఘీభావ సభ**

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 11: ప్రతిభ కంటే న్యాయం ముఖ్యమైనదని, అందరికీ సమన్యాయం దక్కాల్సిన అవసరం ఉన్నదని ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యానించారు. అన్యాయానికి గురైన వాళ్లు ప్రశ్నిస్తేనే సమాజం చైతన్యవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు మేధావుల సంఘీభావ సభ'ను శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీడితకులాల తరపున ఈ సభలో మాట్లాడడం తనకు దొరికిన గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఒక న్యాయమూర్తిగా అన్నికోణాల నుంచి శాస్త్రీయంగా పరిశీలించి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అనేది రాజ్యాంగబద్ధమైనదిగా చెబుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. సమాన అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. చట్టపరంగా, రాజకీయపరంగా ఆటంకాలను తొలగించి వర్గీకరణ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోని ఐక్య ఉద్యమాలకు పునాదిగా వర్గీకరణ ఉద్యమం పనిచేసిందని చెప్పారు. వీలైనంత త్వరగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే నాగేశ్వర్ మాట్లాడుతూ.. ఈసారి వర్గీకరణ జరిగి రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, జయప్రకాశ్ నారాయణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే శ్రీనివాస్, డాక్టర్ నందిని సిధారెడ్డి, విమలక్క, ప్రొఫెసర్లు సూరేపల్లి సుజాత, భాంగ్యా, ఈసం నారాయణ, ఆరెపల్లి రాజేందర్, వివిధ సంఘాల నాయకులు బూరం అభినవ్, గజవెల్లి ఈశ్వర్, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, వెంకట్ మారోజు పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.